www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 31 మే 2025 | 5 | పశ్చిమ గోదావరి

ఘనంగా దాసరి నారాయణరావు వర్ధంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

డాక్టర్ దాసరి నారాయణరావు పేరున ప్రతిష్టాత్మక అవార్డు పాలకొల్లు కళాకారులకు ఇస్తే బాగుంటుందని నటీనట సమాఖ్య అధ్యక్షుడు గుడాల హరిబాబు చెప్పారు. దాసరి నారాయణరావు ఎనిమిదో వర్ధంతి సందర్భంగా శుక్రవారం పాలకొల్లు నడిబొడ్డున ఉన్న దాసరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం తుమ్మలపల్లి సత్యనారాయణ పేరున రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖులకు దాసరి అవార్డులు ఇస్తున్నారని చెప్పారు. గతంలో దాసరి కల్చరల్ యూనిట్ తరపున 10 సంవత్సరాలపాటు జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించేవారని, ప్రస్తుతం దానిని పునరుద్ధరించి దాసరి అవార్డు కూడా ప్రవేశపడితే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు వంగా నరసింహారావు, యాదంరెడ్డి వెంకట రత్నం, మేడికొండ శ్రీనివాస్, జక్కంపూడి మదన్, జిఎన్ఆర్ రవి, గంధం శ్రీనివాస్, పశ్యావుల రవికుమార్, రంగయ్య నాయుడు, వీరాస్వామి, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు గుర్తించారు..

పరిష్కరిస్తారా..!

- సినిమా థియేటర్లలో తనిఖీలతో జనాల్లో చర్చ
- రెండు జిల్లాల్లో వందకుపైగా సినిమా థియేటర్లు
- తినుబండారాల ధరలు చూసి నోరెళ్లబెట్టిన అధికారులు
- ఐమాక్స్‌లో ఫ్యామిలీ ప్యాక్ పాప్‌కార్న్ ధర రూ.700 పైనే
- రెండు సమోసాలు రూ.70, గ్లాసు కూల్‌డ్రింక్ రూ.80
- ఐస్‌క్రీమ్ ధర రూ.వందపైనే, వాటర్‌బాటిల్ రూ. 50
- సినిమా టిక్కెట్ ధరలు రూ.50 నుంచి రూ.295 వరకూ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సినిమా థియేటర్లలో అధికారులు తనిఖీలు చేయడంపై ప్రజల్లో విస్తృతమైన చర్చ సాగుతోంది. వినోదం పేరుతో సినిమా థియేటర్లలో ప్రజలను అడ్డంగా దోచేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది. సినిమా హాళ్లలో టిక్కెట్ ధరలతోపాటు తినుబండారాల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో సినిమా థియేటర్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. భారీగా డబ్బు వసూలు చేస్తున్న థియేటర్లలో కనీస సదుపాయాలు సైతం ఉండని పరిస్థితి. ఇటీవల డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదల విషయంలో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సినిమా థియేటర్లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. రెండు జిల్లాల్లో దాదాపు వంద సినిమా థియేటర్లు వరకూ ఉన్నాయి. జిల్లా కేంద్రం ఏలూరులోనే మల్టీప్లెక్స్ స్క్రీన్‌లు, థియేటర్లు కలిపి పది వరకూ ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోనూ స్క్రీన్లు, థియేటర్లు కలిపి 11 వరకూ ఉన్నాయి. అధికారుల తనిఖీల్లో చాలా థియేటర్లలో మరుగుదొడ్లలో శుభ్రత లేకపోవడం, తాగునీరు ఏర్పాటు వంటి కనీస సదుపాయాలు లేనట్లు అధికారులు గుర్తించారు. ఫైర్‌సేఫ్టీ వంటి నిబంధనలు సైతం సక్రమంగా లేనట్లు వెలుగులోకి వచ్చింది. అదే సమయంలో సినిమా థియేటర్లలో ముఖ్యంగా మల్టీప్లెక్స్‌ల్లో తినుబండారాల ధరలు చూసి తనిఖీలకు వెళ్లిన అధికారులు నోరెళ్లబెట్టిన పరిస్థితి ఉంది. సినిమా నిర్మాతలు వచ్చి అడిగిన వెంటనే కొత్త సినిమాలకు టిక్కెట్లు ధరలు ఇష్టానుసారంగా పెంచేయడమే తప్ప, థియేటర్లలో కనీస సదుపాయాలు, తినుబండారాల పేరుతో జరుగుతున్న దోపిడీ గురించి పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో సామాన్య ప్రజానీకానికి సినిమా వినోదం భారంగా మారిపోయింది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం సినిమాకు వెళ్లాలంటే తక్కువలో తక్కువగా రూ.రెండు వేలు ఖర్చవుతోంది. అదీ అతి జాగ్రత్తగా ఖర్చుపెడితే మాత్రమే. సినిమా థియేటర్లలో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఉచితంగా కల్పించాలని నిబంధనలు చెబుతున్నా ప్రతిచోటా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగే నాథుడే లేకుండాపోయాడు. సినిమా థియేటర్ల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఎట్టకేలకు పవన్‌కళ్యాణ్ సినిమా వివాదంతో ఇప్పుడు అధికారులు ప్రత్యేకంగా థియేటర్లలో తనిఖీలు చేయడంతో సమస్యలన్నీ తెరపైకొచ్చాయి.

ధరలు చూసి దడదడ..!

సినిమా థియేటర్లలో తినుబండారాల ధరలు చూసి అధికారులు సైతం దడదడలాడిన పరిస్థితి ఉంది. పాప్‌కార్న్ మినీ సైజ్ రూ.370కు విక్రయిస్తుండగా, ఫ్యామిలీ ప్యాక్ రూ.700కుపైగానే ఉంది. వాటి ధర బయటి మార్కెట్‌లో రూ.వందలోపే ఉంది. దీన్ని బట్టి ఎన్నిరెట్లు ఎక్కువ ధరకు పాప్‌కార్న్ అమ్ముతున్నారో వేరే చెప్పనక్కర్లేదు. కూల్ డ్రింక్ గ్లాస్ రూ.80కు విక్రయిస్తున్నారు. బయట ధర రూ.20కు మించి లేదు. వాటర్ బాటిల్ ధర బహిరంగ మార్కెట్లో రూ.20 ఉండగా, సినిమా హాళ్లలో రూ.50కు విక్రయిస్తున్నారు. రూ.30 ఖరీదు చేసే ఐస్‌క్రీమ్ రూ.వందకుపైగా అమ్ముతున్నారు. రెండు సమోసాలు రూ.70కు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. సినిమా హాళ్లలో విక్రయించే తినుబండారాల నాణ్యతపైనా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ఉదయం షోకు చేసిన సమోసాలు విక్రయం కాకపోతే రాత్రి ఫస్ట్‌షో సమయంలోనూ విక్రయిస్తుంటారు. సినిమా థియేటర్లలో తినుబండారాల అమ్మకాల్లో జరుగుతున్న దోపిడీ అంతాఇంతా కాదు. అయినప్పటికీ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. ఇక సినిమా టిక్కెట్ల ధరకు వస్తే ఐమాక్స్ థియేటర్‌లో రిక్లయినర్ ధర రూ.295 ఉండగా, తర్వాత టిక్కెట్ ధర టిక్కెట్ రూ.170 వరకూ ఉంది. ఇతర సినిమా థియేటర్లలో రూ.150 నుంచి రూ.50 వరకూ టిక్కెట్ల ధరలు ఉన్నాయి. కొత్త సినిమాలకు అదనంగా టిక్కెట్ల ధర పెంపు ఉంటుంది. సినిమా థియేటర్‌కు వెళ్లిన ప్రేక్షకుడిని నిలువునా దోచేస్తున్న పరిస్థితి ఉంది. సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించిన అధికారులు సమస్యలను గుర్తించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

ఇసుక కొరత లేకుండా స్టాక్ పాయింట్లకు తరలించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వర్షాకాలంలో జిల్లా ప్రజలకు ఇసుక కొరత లేకుండా స్టాక్ పాయింట్లకు తరలించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేనందున వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి కొరతా లేకుండా ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లా పెండ్యాలలో ఓపెన్ ఇసుక రీచ్‌ను జిల్లాకు ప్రత్యేకంగా కేటాయించామన్నారు. పెండ్యాల రీచ్ నుండి జిల్లాలోని భీమవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఉండి తాడేపల్లిగూడెంలోని స్టాక్ పాయింట్లకు ఇసుక రవాణా చేసేందుకు వాహనాలకు కిలోమీటరుకు ఒక టన్నుకు రవాణా ఛార్జీ నిర్ణయంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఇసుక రవాణాకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పెనుగొండ మండల సిద్ధాంతం వద్ద కొత్త ఎండిఎల్ స్టాక్ పాయింట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని పెనుగొండ తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి బి.రవికాంత్, ఆర్‌టిఒ డి.ఉమామహేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, పెనుగొండ తహశీల్దార్ జి.అనితకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుక్కెడు తాగునీరివ్వండి

చించినాడలో సిపిఎం ఆధ్వర్యాన మహిళల ధర్నా

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - యలమంచిలి

తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం పెద్దఎత్తున స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ నాలుగేళ్లుగా గ్రామంలో పంచాయతీ పాలకవర్గం ప్రజలకు తాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామంలో అనేక వందల మందికి తాగునీరు అందక ప్రజలు నానావస్థలు పడుతున్నారన్నారు. ప్రధానంగా అరుంధతీపేటలో తాగునీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉందన్నారు. గుక్కెడు తాగునీటి కోసం పాలకొల్లు, ఇతర సుదూర ప్రాంతాలకు మోటార్ సైకిళ్లపై వెళ్లాల్సి రావడం ఆయా కుటుంబాలపై అదనపు ఆర్థిక భారంగా మారిందన్నారు. గతంలో సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ పాలన సాగించిన కాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా పుష్కలంగా నీరందించే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చాక కనీసం తాగునీరు కూడా అందించలేని దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చించినాడలో ప్రజలందరికీ తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పంచాయతీ బిల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు సరిపల్లి జయప్రభ, జిల్లెళ్ల ప్రశాంతి, గొల్ల విజయకుమారి, బాతిరెడ్డి సుగుణ, ఎం.జయశ్రీ, చెట్టిమి నాగమణి, వార్డు సభ్యులు తెన్నేటి స్టాలిన్, స్థానిక నాయకులు దేవ సుధాకర్, జి.ఏడుకొండల శ్రీనివాస్, ఆంజనేయులు, భాస్కరరావు, ఉదయ్‌కుమార్, జైసింగ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అంతా ఏకం కావాలి

భీమవరంలో సమైక్యతా యాత్ర చేస్తున్న నేతలు

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అంతా ఏకం కావాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. సిపిఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం భీమవరంలో సమైక్యతా యాత్ర నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ప్రకాశం చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా సీతారాం మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి అందరూ సంఘీభావం తెలిపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కొనసాగించలేకపోయిందన్నారు. అమెరికా జోక్యంతో ఆపివేయడం సిగ్గుచేటన్నారు. ఉగ్ర దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను మట్టుబెట్టలేకపోయిందన్నారు. ఉగ్ర దాడులకు గురైన బాధితులను ఆదుకోవడంలో, పరామర్శించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పార్లమెంటు సమావేశం, అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి, దేశంలో అందరి మద్దతు కూడగట్టి ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులను అవమానపరుస్తూ మంత్రులు, బిజెపి నాయకుల మాటలు అత్యంత అవమానకరంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టుపెట్టడం మాని మనల్ని మనమే అవమానించుకోవడం దారుణమన్నారు. పెహల్గాం ఘటనలో బాధితులను రక్షించడం కోసం స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒక మతంపై మరో మతం చేసిన దాడిలా మాట్లాడటం, రెచ్చగొట్టడం దారుణమన్నారు. తక్షణమే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశంలోనూ ప్రపంచంలోనూ చర్యలు చేపట్టాలని, భారత ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, ఇంజేటి శ్రీనివాస్, డి.త్రిమూర్తులు, కృష్ణ, కలిపిండి సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట: ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం మతసామరస్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం రాష్ట్ర

ఆచంటలో..

నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం చేపట్టిన సమైక్యత యాత్ర శుక్రవారం సాయంత్రం ఆచంటలో ఉత్తేజభరితంగా సాగింది. స్థానిక రామేశ్వరస్వామిసత్రం నుంచి కచేరి సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షత వహించారు. సీతారాం మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తుందన్నారు. దాని పర్యసానంగా ఇటీవల కాలంలో ముస్లిములపై 112 దాడులు జరిగాయన్నారు. పెహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అంతా కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన సోఫియా ఖురేషియాని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత సిగ్గుచేటన్నారు. బిజెపికి మద్దతిస్తున్న జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్లిపోవాలంటూ ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారని విమర్శించారు. లౌకిక పార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని అన్నారు. మతసామరస్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.మోహన్‌రావు, కాకర్ల వెంకటేశ్వర్లు, షేక్ పాదుషా, తలుపూరి బుల్లబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, మచ్చ సుబ్బారావు, ఎస్‌విఎన్.శర్మ, పిల్లి చంటిబాబు, గుత్తుల రంగారావు, బండి రంగారావు, దుర్గారావు బాలాజీ, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, ఉన్నమట్ల పండు, సరళ్ల బాలకృష్ణ, కొండేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం: దేశ సమైక్యతను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సిపిఎం ఆధ్వర్యంలో సమైక్య యాత్ర స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి శివాలయం సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ పెహల్గాం దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించాలన్నారు. సైనికుల త్యాగాలను రాజకీయాలకు వాడుకోవటం దేశానికి మంచిది కాదని హెచ్చరించారు. ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి, మానవ సమాజానికి వినాశకరమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు కవురు నరసింహస్వామి, బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ, పొగాకు నారాయణరావు, పొన్నాడ మల్లేష్, తిరుమాని సత్యనారాయణ, తాడి నాగభూషణం, మల్లుగుంట బులి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

వెండితెరపై చెరగని ముద్ర కృష్ణ సొంతం

క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ కనకరాజు సూరి



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సూపర్ స్టార్ కృష్ణ ఓ హీరోగానే కాదు, వ్యక్తిగతంగా మంచి మనసున్న నటులని క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న కనకరాజుసూరి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులో పద్మభూషణ్ సూపర్‌స్టార్ డాక్టర్ ఘట్టమనేని కృష్ణ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ సాహసాలకు, సంచలనాలకు కృష్ణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారన్నారు. చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణ తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఖ్యాతిని పెంచిన ఘనుడన్నారు. కృష్ణ ఫ్యాన్స్ అసోసియషన్ గౌరవాధ్యక్షులు రాయప్రోలు శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలపాటు కృష్ణతో అనుబంధం ఉందని, ప్రతి అభిమాని గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉంటారని, ఆయన పేరిట ఎప్పుడు కూడా సేవా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. అనంతరం పేదలకు భోజనం, గొడుగులను అందించారు. కార్యక్రమంలో కృష్ణ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బరాజు, పేరిచర్ల లక్ష్మణవర్మ, పెన్నాడ శ్రీను, కత్రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వెంటనే ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - యలమంచిలి

కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేటీకరించడానికి చేస్తున్న ప్రయత్నాలను వెంటనే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చించినాడ గ్రామం అమరవీరుల స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం సీనియర్ నాయకులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో అమరవీరుల త్యాగాల ఫలితంగా నిర్మితమైన విశాఖ ఉక్కు కర్మాగారం దేశంలోనే ఒక ప్రముఖమైన పెద్ద పరిశ్రమగా స్థిరపడిందని, దీనిలో గత 40 ఏళ్లుగా అనేక వేలాది మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఇటువంటి పరిశ్రమను ఏదోరకంగా మూసివేసి ప్రయివేటీకరించడానికి కేంద్రం చేస్తున్న కుట్రలను మన రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇసుమంత కూడా అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తే తమ మద్దతును ఉపసంహరించుకుంటామని కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా చెప్పే ధైర్యం ఈ కూటమి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. నాలుగేళ్లుగా అక్కడి కార్మికులు వీరోచితంగా పోరాటం చేయడం వల్ల ఇప్పటివరకు ప్రయివేటీకరించకుండా ఆపగలిగారని, అయితే పరిశ్రమలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను తొలగించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్మికులు గత 20వ తేదీ నుండి సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం పరిశ్రమ భూముల విలువను లెక్క కట్టి అమ్మి వేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ చర్యలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ఎడ్ల మోహన్‌రావు, అంబటి రంగనాయకులు, జిల్లెళ్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, దిద్దే ఏసేబు, గూడూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

దోపిడీ లేని కార్మికవర్గ రాజ్యాధికారమే సిఐటియు లక్ష్యం

భీమవరంలో..

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం

దోపిడీ లేని కార్మిక వర్గ రాజ్యాధికారమే సిఐటియు లక్ష్యమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జెండాను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ఆవిష్కరించి మాట్లాడారు. 1970 మే 30న సిఐటియు ఏర్పడిందన్నారు. ఉద్యోగ, కార్మికుల పక్షాన నికరంగా పోరాడుతోంది సిఐటియు అన్నారు. నేటి మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లు తెచ్చి కార్మికుల హక్కులు కాలురాస్తోందని విమర్శించారు. రానున్న రోజుల్లో కార్మికుల హక్కులకై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని సిఐటియు పిలుపు ఇస్తోందన్నారు. జులై 9న జరిగే సమ్మె కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా జరపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, కె.కోదండం, బి.గణేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వద్ద సిఐటియు జెండాను యూనియన్ అధ్యక్షులు సతి కోదండరామిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఎఐటియుసి నుంచి సిఐటియుగా 1970లో 33 మంది నాయకులు, కొద్దిమంది కార్మికులతో ఏర్పడిందని తెలిపారు. కార్మికుల హక్కులు, వేతనాలు, చట్టాలకే పరిమితం కాకుండా దేశంలోని కోట్లాది మంది కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు సమస్యలు తెలుసుకుని పనిచేస్తోందన్నారు. దేశంలోని పరిశ్రమలను ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, కడప ఆంజనేయులు, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల నారాయణ, కర్రి సుబ్బిరెడ్డి, ఎస్‌విఎస్.రెడ్డి, గాది

తాడేపల్లిగూడెంలో..

వెంకటరావు పాల్గొన్నారు.

బ్రహ్మానంద రెడ్డి మార్కెట్, ఉల్లిపాయల మార్కెట్ యూనియన్ వద్ద సిఐటియు జెండాను యూనియన్ అధ్యక్షులు చల్లా చంద్రరావు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించినప్పుడు ప్రజల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తోందని తెలిపారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కరక వెంకటరావు, పాలపర్తి కృష్ణ, పెనగంటి దుర్గ, బొడ్డపాటి శివ పూడి శేఖర్, గంటా అబ్బులు, దాసరి రాంబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం కార్యాలయం వద్ద జెండాను సీనియర్ నాయకులు దేవ సుధాకర్ ఆవిష్కరించారు. పని ప్రదేశాల్లో జెండాలను వేగి రత్తయ్య, టి.వెంకటేష్, మల్లుల లక్ష్మి నారాయణ, వి.సత్యనారాయణ రైస్ మిల్లుల వద్ద ఎగురవేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు మాట్లాడారు. కార్మిక చట్టాల రక్షణకై జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చల్లా సోమేశ్వరరావు, వై.అజయ్ కుమార్, శివ గౌరి పాల్గొన్నారు.

తణుకు : కార్మికవర్గం పక్షాన నికరంగా, నిజాయతీగా పోరాటం సాగించేది సిఐటియు ఒక్కటేనని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో సిఐటియు అనుబంధ సంఘాలు జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ప్రతాప్ మాట్లాడారు. సిఐటియు ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు, నిర్బంధాలు, అక్రమ కేసులు, విజయాలు సొంతం చేసుకుందన్నారు. సిఐటియు యూనియన్ నాయకులు గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, అంబటి బ్రహ్మాజీ, వైటి. రామకృష్ణ, త్రిమూర్తులు, రామకృష్ణ, గోవిందరావు, పిఎల్ నర్సింహారావు, పి.రాజా, పి.దక్షిణామూర్తి, ఎం.రమేష్, గార రంగారావు, పద్మారావు, ముత్యాలరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

తణుకులో..

ప్రతిఒక్కరూ యోగా చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం ప్రాంగణంలో యోగా అభ్యసన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సుమారు 150 మంది పాల్గొన్న కార్యక్రమంలో యోగాసనాలు, ధ్యానం అభ్యాసన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలన్నారు. శారీరక, మానసిక దృఢత్వానికి యోగా సంజీవని అన్నారు. ప్రజలు వారి సమీప ప్రాంతాల్లో జరిగే యోగా కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు సుబ్బరాజు, కార్యదర్శి చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్లో దోమల మందు స్ప్రే

ప్రజాశక్తి - గణపవరం

ముందస్తు కీటక నియంత్రణ చర్యల్లో భాగంగా శుక్రవారం స్థానిక బాలికల, బాలుర హాస్టళ్లలో పిహెచ్‌సి ఆధ్వర్యంలో దోమల నివారణ ఇండోర్ రిసిడ్యూవల్ మాలాథియాన్ స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.కిరణ్మయి తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలను నివారించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు దరిచేరకుండా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, హెల్త్ అసిస్టెంట్లు నల్లయ్య, శ్రీనివాస్, ఎ.వుష్ణ, ఎం.యేసు పాల్గొన్నారు.

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సమాజసేవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ప్రతిఒక్కరి నైతిక బాధ్యత అని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం ఎంఎల్‌ఎ అంజిబాబు పుట్టినరోజు సందర్భంగా భీమవరం అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండలంలో 25 మంది వికలాంగులకు నూతన వస్త్రాలు, దుప్పట్లు ఎంఎల్‌ఎ అంజిబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటివారికి సహాయం చేయడం స్ఫూర్తిదాయకమైన కార్యక్రమమని తెలిపారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆర్థికాంశాల పట్ల అవగాహనుండాలి

ప్రజాశక్తి - గణపవరం

కిశోర బాలికలకు సొమ్ము పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని అన్నారు. శుక్రవారం ముప్పర్తిపాడులో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు సొమ్ము పొదుపుపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచి డబ్బు పొదుపు చేసుకునే అలవాటు చేసుకోవాలన్నారు. డబ్బు పొదుపు చేసుకుంటే భవిష్యత్‌లో మన ఆర్థిక అవసరాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఎంఎల్‌హెచ్‌పి మేరిగ్రేస్, ఎఎన్‌ఎం బి.శాంతకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఆడపిల్లలకు ఆర్థిక అంశాల పట్ల అవగాహన అవసరమని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం కిశోరి వికాసం వేసవికాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లిపూడి, బ్రాహ్మణ చెరువు, నెలమూరు గ్రామాలలో నిర్వహించిన ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు గురించి కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. సిడిపిఒ సూపర్‌వైజర్లు ఎస్.వెంకటలక్ష్మి, పి.వరలక్ష్మి, బి.పోశమ్మ పాల్గొన్నారు.

ఆకివీడు : గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న కిశోర వికాసం ప్రత్యేక వేసవిలో భాగంగా శుక్రవారం 9వ రోజు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జి.వాణి విజయరత్నం స్థానిక గొల్లవిల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కిశోర బాలికలకు ఆమె భవిష్యత్తులో జీవితంలో పాటించాల్సిన ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు వంటి అంశాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి, స్థానికులు పాల్గొన్నారు.

కిల్కారి సేవలపై శిక్షణ

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిల్కారి సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి గీతాబాయి అన్నారు. కిల్కారి సేవలపై నోడల్ ఆఫీసర్లు, ఆశాలకు శుక్రవారం ట్రెయినింగ్, రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణులు, బాలింతలు కోసం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మాతా శిశుమరణాలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఈ కిల్కారి కాల్ సర్వీస్‌ను ప్రవేశం పెట్టారన్నారు. గర్భిణీగా నెల నుంచి మొదలుకొని బిడ్డ మొదటి సంవత్సరం పూర్తయ్యే వరకూ సలహాలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 01244451660 మొబైల్ నెంబర్‌ను గర్భిణులు వారి మొబైల్‌లో సేవ్ చేసుకున్నట్లయితే కాల్ వచ్చినప్పుడు ఎత్తి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారన్నారు. ఆశా, నోడల్ ఆఫీసర్లు మీ పిహెచ్‌సి పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఆశా, ఎఎన్ఎంలు కిల్కారి సేవలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కిల్కారి ప్రోగ్రాంలో బాగా పనిచేసిన ఆశాలకు బహుమతులు అందజేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సుధాలక్ష్మి, డిపిహెచ్‌ఎన్‌ఒ వెంకట్ రత్నం, డిసిఎంఎస్.వెంకటస్వామి, పిహెచ్‌సి వైద్యాధికారులు గులాబ్ రాజ్‌కుమార్, మొహిసినాతాజ్, కిల్కారి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూ.5 లకే అల్పాహారం అందించే అన్నా క్యాంటీన్‌లో ఆయన స్వయంగా అల్పాహారం తిని పేదవారితో మాట్లాడి అల్పాహారం, భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారంలో గానీ, భోజనంలో గానీ ఎటువంటి నాణ్యత తగ్గినా స్వయంగా ఫిర్యాదు చేయొచ్చన్నారు. అన్నా క్యాంటీన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శిగా జయలక్ష్మి

ప్రజాశక్తి - ఉండి

మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శిగా ఉండి మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి నియామకమైనట్లు శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రామకృష్ణరాజు సహకారంతో తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. తనను నమ్మి మండల సమాఖ్య అధ్యక్షురాలుగా ఎంపిక చేయడమే కాకుండా జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆర్థిక అభివద్ధికి కషి చేస్తానని ఆమె వివరించారు.

తాళ్లకోడులో ఇళ్ల సర్వే

ప్రజాశక్తి - ఆకివీడు

తాళ్లకోడులో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో నివాసితుల ఇళ్లను రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. రెండు రోజులుగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సర్వే చేస్తున్నట్లు వారు చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన జాబితా ప్రకారం ఇంటి యజమానులు నివసిస్తున్నారా, అలా కాకుండా ఆ ఇంటిలో వేరొకరు నివసిస్తున్నారా, యాజమాన్యం మారిందా, ఎవరి ఆధీనంలో స్థలం ఇల్లు ఉన్నాయనే అంశంపై విచారణ సాగిస్తున్నట్లు తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరావు తెలిపారు. ఈ సర్వేలో స్థానిక సిబ్బంది గాని ఉద్యోగులు గాని లేరు. జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన అధికారులను ఇక్కడ సర్వేలకు నియమించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

ఉండి ఆకివీడు రహదారిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆకివీడుకు చెందిన షేక్ రియాజ్ (42) ఆకివీడులో క్రికెట్ కోచ్‌గా, పల్స్ హాస్పిటల్‌లో ఫార్మాసిస్ట్‌గా పనిస్తున్నాడు. గురువారం ఉదయం మోటార్ సైకిల్‌పై భీమవరం వెళ్లి అక్కడి నుంచి ఏలూరులో జరిగే కార్యక్రమానికి అతని స్నేహితులతో కలిసి కారులో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గణపవరం మీదుగా భీమవరం చేరుకున్నాడు. భీమవరం నుంచి రాత్రి 12 గంటల సమయంలో రియాజ్ ఆకివీడులోని తన ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో అదుపుతప్పి పక్కనే ఉన్న చిన్న గుడిని బలంగా ఢీకొన్నాడు. దీంతో రియాజ్ తకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎఎస్ఐ దువ్వాపు శ్రీనివాస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రియాజ్ మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షేక్ రియాజ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. అడుగంటిన చెరువులో బోర్లా పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారమిచ్చారు. విఆర్‌ఒ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని ఒంటిపై నైట్ ప్యాంటు మాత్రమే ఉంది, కుళ్లిన స్థితిలో బాడీ ఉందన్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పూడికతీత పనుల్లో జాప్యం..!

కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క

శివారు భూములకు అందని సాగునీరు

ఒఅండ్ఎం నిధులు మంజూరైనా అరకొర పనులు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయాయి. పూడికతీత పనులు వెంటనే చేపట్టేందుకు ఒఅండ్ఎం నిధులు మంజూరైనా పనులు మాత్రం అరకొరగా సాగుతున్నాయి. కాలువ చివరి ఆయకట్టు పంటలకు సాగునీరందేలా పూడిక తీత పనులు చేపట్టాలని ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఇరిగేషన్ అధికారులు పిసి, డిసి ఛైర్మన్‌లకు, నీటి సంఘాల అధ్యక్షులకు సూచించారు. మెయిన్ కాలువలతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువలను కూడా పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అయితే కొన్ని చోట్ల పనులు హడావుడీగా మొదలయ్యాయి. మరికొన్ని చోట్ల అరకొర నిధులతో ఇప్పుడే పనులు చేపట్టలేమని, కొంతకాలం వేచి చూద్దామన్న ఆలోచనలో అధ్యక్షులు ఉన్నారని తెలుస్తోంది. కాలువల్లో పూడిక తీత, గట్లు పటిష్టం చేయడం, అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వెంకయ్య వయ్యేరు పంట కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క

ఏప్రిల్ 27న కాలువలకు నీరు నిలుపుదల చేశారు. జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేయనున్నారు. ఇంకా రెండు రోజులు మాత్రమే సమయం ఉంది. నిబంధనల ప్రకారం కాలువలకు నీటిని నిలుపుదల చేసే సమయానికి కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క, తూడు తొలగింపు, షట్టర్లు, గేట్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

గత ఐదేళ్ల వైసిపి పాలనలో కాలువల పూడికతీత పనులు పూర్తిగా పడకేశాయి. దీంతో పంట కాలువల్లో మెరక పేరుకుపోయి చిన్నపాటి వర్షానికి పంట పొలాలు నీట మునుగుతున్నాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో గోదావరి నుంచి వచ్చే నీటితో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఆయకట్టు సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు, 300లకుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీటి సరఫరా అవుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.11 కోట్లకు సంబంధించిన తాత్కాలిక ఒఅండ్ఎం నిధులతో మాత్రమే పనులు సాగుతున్నాయి. జూన్ 15వ తేదీ వరకూ పనులు సాగే అవకాశం ఉంది. పంట కాల్వల్లో పూడిక తీత పనులు సకాలంలో చేయకపోతే పంటలు నష్టపోతున్నామని, పూడిక తీత పనులు తక్షణం చేయాలని రైతులు కోరుతున్నారు. కొన్ని చోట్ల పూడిక తీత పూర్తిగా జరగకుండానే పనులు నిలిపివేస్తున్నారని, వర్షం వస్తే మళ్లీ మట్టి కాలువలోకి వెళ్లిపోయే అవకాశాలున్నాయి.

ఏటా వేల ఎకరాల్లో పంటనష్టం..

పంట కాలువలు పూడుకపోవడంతో ఏటా వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. గడిచిన ఖరీఫ్‌లో దాదాపు 16 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు అధికారులు తేల్చారు. దీనికి ప్రధాన కారణం ఆధునికీకరణ జరగకపోవడమే. దీంతో కాలువలు మెరకదేరిపోవడంతో వర్షాలకు పంట పొలాల్లోంచి నీరు కిందకు పారని పరిస్థితి. రోజుల తరబడి పొలాల్లోనే నీరు నిలిచిపోవడంతో పంటలు కుళ్లిపోయి దెబ్బతింటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంకయ్య వయ్యేరు పంట కాలువల్లో పూడికతీత పనులు జరగకపోవంతో కాలువలో మట్టి పేరుకుపోయి నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. కాలువల్లో పూడిక తీత పనులు సరిగ్గా లేవని, కొన్ని చోట్ల నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. పంట కాలువల్లో పూడిక తీత, గుర్రపు డెక్క, తూడు పనులు పనులు సక్రమంగా జరగకపోతే పంటలకు నీరు సరిగ్గా అందక తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువలను ఆధునికీకరించాలని కోరుతున్నారు.

పూడిక తీత పనులు వెంటనే చేపట్టాలి..

ఆకుల హరేరాం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రధాన పంట కాలవలు, అనుబంధ కాలువలన్నీ గుర్రపు డెక్క తూడుతో నిండిపోయాయి. మట్టి మేటవేసి సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆలమూరు - ఓడూరు - నెలమూరు వరకూ పంట కాలువలో పూడికతీత పనులు సరిగ్గా జరగడం లేదు. వర్షం వస్తే గట్టుమీద వేసిన మట్టి జారిపోయే అవకాశం ఉంది. నెలాఖరులోగా కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన పూడిక తీత పనులు చేపట్టక పోతే ఖరీఫ్ నాటికి పంట భూములకు సాగునీరందక తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది.

నియోజకవర్గ అభివృద్ధికి బంగారు బాట

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి బంగారు బాటలు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, టిడిపి ఇన్‌ఛార్జి ఛైర్మన్ వలవల బాబ్జి, ఎంఎల్‌ఎ బొలిశెట్టి మాట్లాడారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ డయాలసిస్ సెంటర్ కోసం రూ.రెండు కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ.కోటి సహకరించడంపై హర్షం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలో రైల్వే గేట్లు అభివృద్ధి కోసం సుమారు రూ.300 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులకు అనుమతులు తెచ్చుకున్నామని ఎంఎల్‌ఎ తెలిపారు. 200 కోట్ల పనులకు టెండర్లు పిలిచామని, రూ.110 కోట్లతో జువ్వలపాలెం వద్ద మూడో ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జువ్వలపాలెం గేట్ నెంబర్ 374, నవాబుపాలెం గేట్ నెంబర్ 378, ఆరేళ్ల గేట్ నెంబర్ 379 పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా రూ.23 కోట్లతో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ అభివధికి కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. తాడేపల్లిగూడెం గూడ్స్ షెడ్లకు రూ.8 కోట్లు మంజూరు చేశారన్నారు. వైఎస్‌ఆర్ కడప జిల్లాలో పెళ్లికి వచ్చిన ఓ మూడేళ్ల చిన్నారిని దారుణంగా అత్యాచారం చేసి చంపేసిన నిందితుడిని వదిలే ప్రసక్తి లేదని శ్రీనివాస్ అన్నారు.

థింక్ ఇండియాతో నిట్ ఒప్పందం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) బెంగుళూరుకు చెందిన థింక్ ఇండియా సంస్థతో అవగాహనా ఒప్పందం (ఎంఒయు) నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు, థింక్ ఇండియా ఎపి రాష్ట్ర కన్వీనర్ బి.చంద్రశేఖర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు రమణారావు మాట్లాడుతూ భారతదేశంలోనే ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐఎస్‌సి, ఐఐఎం బెంగుళూరు, నింహన్స్, ఎన్‌ఎల్‌ఎస్‌ఐయూ వంటి విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు ఈ థింక్ ఇండియా సంస్థను 2006లో ప్రారంభించారన్నారు. వారి సూచనలు, సలహాలు నిట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఒకరి ఆలోచనలను ఒకరు పంచుకోవటంతోపాటు ఇంటర్న్ షిప్ చేసుకునే వెసులుబాటు కూడా ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు సిద్ధం చేయడం, పర్యావరణ, సాంస్కృతిక భద్రత అంశాల్లో చైతన్యం తీసుకురావడం, భారతీయ విలువల ప్రోత్సాహం, రాష్ట్ర ఐక్యత, సామాజిక సమతుల్యతను పెంపొందించడం, జాతీయ సమస్యలపై చర్చలు, పరిష్కారాలు వంటి విషయాలపై ఇరువురు చర్చించుకోవడానికి ఈ అవగాహనా ఒప్పందం దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ ప్రొఫెసర్ డాక్టర్ రవికిరణ్‌శాస్త్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి, థింక్ ఇండియా సంస్థ రాష్ట్ర కోకన్వీనర్ ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్‌ఎ అంజిబాబు పుట్టినరోజు

మీ అభిమానం మరువలేను : ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మంచితనం.. మానవత్వం ఎంఎల్‌ఎ అంజిబాబు సొంతమని, పేదల అభ్యున్నతే ఆయన ధ్యేయమని పలువురు వక్తలు అన్నారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు పుట్టినరోజు వేడుకలను భీమవరం అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ వేదికలో నిర్వహించారు. జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, వీర మహిళలు అంజిబాబుకు శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సత్కరించారు. జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ ప్రజలు మెచ్చిన నాయకుడు ఎంఎల్‌ఎ అంజిబాబు అన్నారు. మీరు నాపై చూపించిన ఆదరణ అభిమానం ఎప్పటికి మరువలేనని ఎంఎల్‌ఎ తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి డిగ్రీ, పీజీ సెమిస్టర్ ఫలితాల విడుదల

ప్రజాశక్తి - తణుకు

మేలో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో జరిగిన డిగ్రీ ప్రథమ సంవత్సరం (రెండో సెమిస్టర్), ద్వితీయ సంవత్సరం (నాలుగో సెమిస్టర్), తృతీయ సంవత్సరం (ఆరో సెమిస్టర్) పరీక్షా ఫలితాలను శుక్రవారం కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడారు. ఈ ఫలితాల్లో 89 శాతం సగటు ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులను అభినందించారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ జరగనున్నాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. మండలంలోని 48 దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యవసరాలు పంపిణీ జూన్ 1వ తేదీన ప్రారంభించనున్నారని తెలిపారు. ఒకటి నుంచి 15వ తేదీ వరకూ ఉదయం ఎనిమిది నుండి 12 గంటల వరకూ, సాయంత్రం నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకూ రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకులు లబ్ధిదారులకు అందించనున్నారు.

పెనుమంట్ర : మండలంలోని వినియోగదారులకు జూన్ ఒకటో తేదీ నుండి రేషన్ షాపుల ద్వారా సరుకులు ఇవ్వాలని తహశీల్దార్ రవికుమార్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన మండలంలోని రేషన్ షాపుల డీలర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.

చేలో వరి దుబ్బులు తగలబెట్టడం సరికాదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరి కోతల అనంతరం చేలో మిగిలిన వరి దుబ్బులను, గడ్డిని తగులబెట్టడం మంచిది కాదని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం మల్లిపూడి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉండి కృషి విజ్ఞాన కేంద్రం, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సంయుక్త సారథ్యంలో నిర్వహించారు. డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ వరిలో వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి వివరించారు. ఎరువులు, కలుపు మందుల యాజమాన్యం గురించి తెలిపారు. రబీ పంట కోసిన వెంటనే రైతులు వరిగడ్డిని తగలబెడుతున్నారని, వరిగడ్డిని తగలబెడితే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని అన్నారు. భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందని, తద్వారా మొక్కలకు అందుబాటులో ఉండాల్సిన పోషకాలు అందవని హెచ్చరించారు. ఈ గడ్డిని కాల్చకుండా డీకంపోజర్లు ఉపయోగించి గడ్డిని కుళ్లింపజేసి దానిని భూమిలో కలియదున్నాలని, దీనివల్ల సేంద్రియ పదార్థం భూమికి అందుతుందని తెలిపారు. మరో సైంటిస్ట్ డాక్టర్ పి.వినయలక్ష్మి మాట్లాడుతూ ముంపునకు తట్టుకునే వరి రకాల గురించి తెలిపారు. కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిలా సమన్వయం చేశారు. కార్యక్రమానికి ఆయిల్‌పామ్ పరిశోధనా స్థానం పెదవేగి నుండి డాక్టర్ కె.మనోరమ, ఉండి కెవికె శాస్త్రవేత్త డాక్టర్ బిందు ప్రవీణ, మార్టేరు పరిశోధనా స్థానం నుండి డాక్టర్ బి.సహదేవరావు, డాక్టర్ ఆనంద్ కుమార్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, గ్రామ సర్పంచి దొంగ మహాలక్ష్మి, కూటమి నాయకులు సుందర్‌రామిరెడ్డి, కాసాని విజయప్రసాద్, సోమేశ్వరరావు, కర్రి బ్రహ్మానందరెడ్డి, ఉద్యాన శాఖాధికారులు, వెటర్నరీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలి

ప్రజాశక్తి - తణుకు

ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చదువుకోలేని స్థితిలో ఉన్న పేద విద్యార్థులను దాతలు దత్తత తీసుకుని వారి ఉన్నతికి తోడ్పడాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం తణుకులో నూతనంగా నిర్మించిన కిరాణా వర్తక సంఘం భవనాన్ని రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థానంలో సమాజంలో కొనసాగుతున్న వారు పేదలకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పి-4 విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కిరాణా వర్తక సంఘం సభ్యులు ఐక్యంగా ఉంటూ నిధులు సమకూర్చుకొని ఒక భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఇదే రీతిగా సభ్యులు పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలని కోరారు. వ్యాపారులు సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించి తణుకులో ప్లాస్టిక్ నిషేధానికి సంపూర్ణ సహకారం అందించాలని ఎంఎల్‌ఎ కోరారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు రెడ్డి వీరన్న, కార్యదర్శి కోర్లేపర సత్యనారాయణ, కోశాధికారి శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

రైతుకు లాభసాటి వ్యవసాయం అందించడమే లక్ష్యం

ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ఆచంట: రైతుకు లాభసాటి వ్యవసాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశమని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. కొడమంచిలి రైతు భవనంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మాట్లాడారు. 1.5 కోట్ల మంది రైతులకు 700 జిల్లాల్లో 2 వేల బృందాలు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతుకు నికర ఆదాయం వచ్చేలా వరి వంగడాలను సాగు చేసి చీడపీడల నివారణకు రైతులు శాస్త్రవేత్తల, వ్యవసాయ అధికారుల సలహాలతో ముందుకెళ్లాలని సూచించారు. రైతులు విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడడం కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించుకునే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాల్లో బ్యాన్ చేసిన రసాయనాలు భారతదేశంలో వినియోగించడం జరుగుతుందని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత రైతులపై ఉందని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉండి అధిపతి ఎన్.మల్లికార్జునరావు, వై.సుబ్బయ్య ప్రధాన శాస్త్రవేత్త పి.సహదేవరెడ్డి మేలైన యాజమాన్య పద్ధతులు చీడపీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో చర్చాగోష్టి నిర్వహించారు. జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, వైస్ ఎంపిపి నాగరాజు, పాలకొల్లు ఎడిఎ అడ్డాల పార్వతి ఉద్యానవనాధికారి ఎన్.ప్రియదర్శిని, మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదుల స్వీకరణ

నరసాపురం: నరసాపురం జనసేన కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కలిసి హాజరై ప్రజల నుంచి వచ్చిన వ్యక్తిగత, సామూహిక సమస్యలు, అభ్యర్థనలు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని నాయకులకు తెలియజేశారు.

అనురాధ మరణం తీరని లోటు: సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు భార్య అరసం జిల్లా సమితి సభ్యురాలు, న్యాయవాది మల్లుల అనురాధ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనురాధ మరణం కమ్యూనిస్టు పార్టీకి, అరసం, మహిళా సమాఖ్యకు ఎంతో తీరనిలోటని పార్టీ నాయకులు పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతిక కాయంపై పార్టీ జెండాను కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం జీర్ణించుకోలేనిదని సిపిఐ జిల్లా కోనాల భీమారావు తెలిపారు. సిపిఐ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, జిల్లా కార్యదర్శి సికిలే పుష్ప కుమారి, అలాగే ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్య, చేతివృత్తుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్, చాంద్ బాషా సంతాపం తెలిపారు. సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు సంతాపం తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, నాయకులు సంతాపం తెలిపారు.

ముందుగానే పింఛన్ల పంపిణీ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

సంక్షేమ పింఛన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి తెలిపారు. మండలంలో 17 పంచాయతీల్లో మొత్తం 10,412 మంది పెన్షన్‌దారులకు రూ.4 కోట్ల 38 లక్షల 99 వేల 500 రూపాయలు ఒక్కరోజు ముందుగా శనివారం పంపిణీ చేయనున్నామని తెలిపారు. జూన్ 1 తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ముందే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి వయసు పిల్లలు బడి బయట ఉండరాదన్నారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కె బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి సమగ్ర శిక్షణ ద్వారా ఉచితంగా వికలాంగ పిల్లలకు కల్పిస్తున్న సదుపాయాల గురించి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాలమ్మ మహా అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లాకు దిగువన దేశాలమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అన్నసమారాధనలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌ఎ మేకా శేషుబాబు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ కోర్స్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో మహిళలకు నిర్వహించే ఉచిత కంప్యూటర్ కోర్స్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు అన్నారు. తమ కళాశాలలో ఎపి ఎస్‌ఎస్‌డిసి ద్వారా పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలకు 45 రోజులపాటు స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు జూన్ 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పూర్తి వివరాలకు తమ కళాశాలను సంప్రదించాలని ఆయన కోరారు.

విత్తనాలు కొనుగోలు చేస్తే బిల్లు తప్పనిసరి

ప్రజాశక్తి - నరసాపురం

ఎరువుల దుకాణాల్లో రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే వ్యాపారులు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ ఎడిఎ అనిల్ కుమారి ఆదేశించారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో సబ్ డివిజన్ విత్తన, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. రానున్న సార్వా సీజన్లో ఎంటియు 1232, 1140, పిఎల్‌ఎ 1100 వంటి రకాల విత్తనాలను వేయడం వల్ల ముంపును తట్టుకుంటాయిన్నారు. ఎంటియు 1061, 1064, 1318, 1172 రకాల విత్తనాలు వేసుకోవచ్చని, అయితే సాగు కాల పరిమితి ఎక్కువుగా ఉంటుందని తెలిపారు. డీలర్లు పైరకం విత్తనాలను రైతులు తీసుకెళ్లే విధంగా అందుబాటులో ఉంచాలన్నారు.

పిహెచ్‌సిలో ప్రసవాలు పెంచాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు పెరిగే విధంగా వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా వైద్యశాఖాధికారి గీతాభాయి ఆదేశించారు. శుక్రవారం గణపవరం పిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఫార్మసీ ల్యాబ్‌ను పరిశీలించి అనంతరం స్థానిక డాక్టర్ కిరణ్మయితో మాట్లాడారు. వ్యాధులసర్వే ఎలా జరుగుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిదేనని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో కూడా ఒఆర్ఎస్ ద్రావణం కలిపి ఉంచాలని, ఆసుపత్రికి వచ్చిన రోగులకు అవసరమైన వారికి వెంటనే ఇవ్వాలని తెలిపారు. సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, డి.శ్రీరామమణి, హెచ్‌వి.పద్మజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

పాఠశాలలు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తామని ఎంఇఒ-2 జాన్ ప్రభాకర్ అన్నారు. జిల్లా నుంచి వచ్చిన పుస్తకాలను పట్టణంలోని మిషన్ హైస్కూల్లో భద్రపర్చారు. ఎంఇఒ జాన్ ప్రభాకర్ ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు సమాచారం అందించారు. శుక్రవారం వచ్చిన ఉపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్య వారీగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం నుంచి ఎలిమెంటరీ స్కూల్స్ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఎంఇఒ వెంట సిఆర్ పిలు బి.శ్రీను, తాతయ్య, మణి, నేతాజీ, శ్రీనివాస్, ఆనంద్, రవీంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, శేరేపాలెం పంచాయితీ హరిజన పేటకు చెందిన నల్లి చిన వెంకటరత్నం, తండ్రి: నల్లి దేవ సహాయం అను నేను గ్రామంలో ఇంటి నుండి **నా పాస్‌పోర్ట్ నెంబర్ : X7118993** తో ద్విచక్ర వాహనంపై మొగల్తూరు జిరాక్స్ కాపీల నిమిత్తం వెళుతూ ఉండగా మార్గమధ్యంలో జారి పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

నల్లి చిన వెంకటరత్నం
S/o. దేవ సహాయం
శేరేపాలెం, హరిజనపేట,
మొగల్తూరు మండలం,
డోర్ నెం. 2-127, పిన్ కోడ్: 534281
సెల్ నెం: 99597 84605